TGTEL/25/A4812

Voice of Vande Bharath

వాయిస్ ఆఫ్ వందే భారత్

తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 89 | పేజీలు : 04| వెల: రూ.3/-

తెలంగాణ మంగళవారం | అక్టోబర్ 27, 2026



మహారాష్ట్ర సీఎంతో సీఎం రేవంత్ భేటీ

తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై కీలక చర్చలు

152 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మాణానికి తెలంగాణ ప్రతిపాదన

సానుకూలంగా స్పందించిన మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్

ఎన్.హెచ్.ఎం ఉద్యోగుల సమ్మెకు బీఆర్ఎస్ మద్దతు

- ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ డిమాండ్
- మెడికవర్ ఆస్పత్రిపై ఉన్న శ్రద్ధ ఉద్యోగులపై ఏదీ?
- రేవంత్ రెడ్డి పాలనలో కాంట్రాక్ట్ ఉద్యోగుల పట్ల తీవ్ర అన్యాయం



హన్మకొండ జిల్లా కోర్టులో పట్టభద్రుల ఓటర్ నమోదు

- హాజరైన మాజీ ఎంపీ వినోద్ కుమార్, మాజీ విప్ వినయ్ భాస్కర్, రాకేష్ రెడ్డి
- న్యాయవాదులు ఓటర్లుగా నమోదు కావాలని పిలుపు



అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ నూ ఈసీనే ఓటరుగా నమోదు చేయాలి

ఈసీఓ సుదర్శన్ రెడ్డికి బీఆర్ఎస్ నేతల వినతి

గడువు ముగుస్తున్నా నమోదులో తీవ్ర జాప్యంపై తలసాని ఆగ్రహం



లౌకికవాదం, ఓటు హక్కు పరిరక్షణే ధ్యేయంగా కాంగ్రెస్ పోరాటం

- సిఈసి జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలి
- ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ అవినాష్ పాండే

హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : హైదరాబాద్‌లోని కాంగ్రెస్ రాష్ట్ర కార్యాలయం 'గాంధీ భవన్'లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ అవినాష్ పాండే ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా



దేశంలో ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న పోరాటాలపై నాయకులు సుదీర్ఘంగా చర్చించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తక్షణమే ఆ పదవి నుంచి తొలగించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. దేశంలో లౌకిక భావజాలాన్ని దెబ్బతీసేందుకు మరియు పౌరుల ప్రాథమిక ఓటు హక్కును కాలరాసేందుకు జరుగుతున్న కుట్రలను తిప్పికొడతామని స్పష్టం చేశారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా పోరాటాన్ని ఉధృతం చేస్తుందని తెలిపారు. ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే గణేష్‌లతో పాటు పలువురు డీసీసీ అధ్యక్షులు, వివిధ నియోజకవర్గాల ఇన్‌చార్జులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

గురునానక్ మందిర్ కమాన్ల నిర్మాణానికి జగ్గారెడ్డి భూమిపూజ

- హామీని నిలబెట్టుకున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్
- ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు



వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
మంగళవారం, అక్టోబర్ 27, 2026

నవంబర్ 1న ఢిల్లీలో ‘ఓట్ బచావో – దేశ్ బచావో’నిరసన

కంటోన్మెంట్‌లో సికింద్రాబాద్ డీసీసీ సన్నాహక సమావేశం

ఓటు హక్కు పరిరక్షణకు ఉద్యమించాలని పిలుపు

సికింద్రాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అక్రమాలకు పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ప్రమాదంలో పడేస్తోందని, ఓటు హక్కును పరిరక్షించుకునేందుకు నవంబర్ 1న ఢిల్లీ వేదికగా ‘ఓట్ బచావో – దేశ్ బచావో’ భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సికింద్రాబాద్ డిసిసి ఆధ్వర్యంలో కంటోన్మెంట్ నియోజకవర్గంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, ఏఐసిసి జనరల్ సెక్రటరీ అవినాష్ పాండే, ఏఐసిసి ఇన్‌ఛార్జి సెక్రటరీ సచిన్ సావంత్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే శ్రీ గణేశ్, సికింద్రాబాద్ డిసిసి అధ్యక్షుడు దీపక్ జాన్ తో పాటు సికింద్రాబాద్ జిల్లా పరిధిలోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. తెలంగాణ ఏర్పాటు బిల్లుకు రాజ్యసభలో మద్దతు తెలిపిన ఏఐసిసి జనరల్ సెక్రటరీ అవినాష్ పాండేకు ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించి, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడింది కాంగ్రెస్ పార్టీయేనని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో బిజెపి ఇచ్చిన ‘400 సీట్లు’ నినాదాన్ని ప్రజలు తిరస్కరించారని, రాజ్యాంగాన్ని మార్చాలని చూసిన బిజెపి కుట్రలను తిప్పికొట్టారని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని మార్చే కుట్రను రాహుల్ గాంధీ ముందే గుర్తించి ప్రజలను అప్రమత్తం చేశారని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడే ప్రధాన ఆయుధం ఓటు హక్కు అని, కానీ నేడు ఆ ఓటు హక్కే చోరీకి గురవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా “ఓట్ బచావో – దేశ్ బచావో”, “ఓట్ చోరీ – గద్దీ చోడో” నినాదాలతో ఉధృత పోరాటం కొనసాగుతుందని తెలిపారు. సికింద్రాబాద్ డిసిసి అధ్యక్షుడు దీపక్ జాన్ ఆధ్వర్యంలో గల్లీ గల్లీలో ఓటు పరిరక్షణ ఉద్యమం సాగాలని పిలుపునిచ్చారు. కేంద్ర ఎన్నికల సంఘం బిజెపికి అనుబంధ సంఘంలా మారి అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ఓట్లను అక్రమంగా తొలగిస్తున్నారని దుయ్యబట్టారు. ఓటు సవరణ ప్రక్రియలో జరుగుతున్న అక్రమాలపై ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు. అలాగే జ్ఞానేశ్వర్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నవంబర్ 1న ఢిల్లీలో జరిగే భారీ నిరసనలో తెలంగాణ గళాన్ని బలంగా వినిపించాలని, హైదరాబాద్ నగర పరిధిలోని ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు సమష్టిగా ఈ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లాలని కోరారు.

మహారాష్ట్ర సీఎంతో సీఎం రేవంత్ భేటీ

- తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై కీలక చర్చలు
- 152 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మాణానికి తెలంగాణ ప్రతిపాదన
- సానుకూలంగా స్పందించిన మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్



ముంబై, వాయిస్ ఆఫ్ వందే భారత్ : తెలంగాణ రాష్ట్రానికి అత్యంత కీలకమైన తుమ్మిడిహెట్టి నీటిపారుదల ప్రాజెక్టుపై ముంబైలోని సహ్యాద్రి ప్రభుత్వ అతిథి గృహంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం సోమవారం కీలక సమావేశం నిర్వహించింది. ఈ భేటీలో తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రాణహిత నదిపై ప్రతిపాదించిన తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు పెంపు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, భూసేకరణ మరియు పరిహారం వంటి సాంకేతిక అంశాలపై సమగ్రంగా చర్చించారు.సమావేశం ప్రారంభంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజెంటేషన్ ద్వారా తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్థిక వెనుకబాటుతనం, గిరిజనులు ఎదుర్కొంటున్న పరిస్థితులను మహారాష్ట్ర బృందానికి వివరించారు. 2016 ఒప్పందం ప్రకారం 148 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మిస్తే తెలంగాణ సాగు, తాగునీటి అవసరాలు పూర్తిస్థాయిలో తీరవన్నారు. గ్రావిటీ ద్వారా నీటిని తరలించి విద్యుత్, నిర్వహణ వ్యయాలను తగ్గించాలంటే బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో నిర్మించడమే సరైన ప్రత్యామ్నాయమని స్పష్టం చేశారు.బ్యారేజీ ఎత్తు పెంపు వల్ల మహారాష్ట్ర పరిధిలో ముంపునకు గురయ్యే భూములకు ఆ రాష్ట్ర భూసేకరణ నిబంధనలు, పరిహార విధానం ప్రకారమే రైతులకు నష్టపరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సంపూర్ణంగా సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ – మహారాష్ట్ర సరిహద్దుల మధ్య ఉన్న సుదీర్ఘ చారిత్రక, సాంస్కృతిక అనుబంధాన్ని గుర్తుచేశారు. ‘జల్, జంగిల్, జమీన్’ కోసం కొమురం భీమ్ సాగించిన పోరాట కాలం నుంచి ఆదిలాబాద్ గిరిజనులు సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారని, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత రక్షణ, పౌర విమానాశ్రయం అందుబాటులోకి వస్తే రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు, రవాణా సదుపాయాలు పెరుగుతాయని తెలిపారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదని, రెండు రాష్ట్రాలను భౌతికంగా, ఆర్థికంగా అనుసంధానించే వారధిగా నిలుస్తుందని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రతిపాదనలపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు.తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, తమ రాష్ట్ర ప్రజలకు నష్టం కలగనంత వరకు 148 మీటర్ల ఒప్పందాన్ని పునఃపరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఉన్నతాధికారుల కమిటీ ఏర్పాటు: ప్రాజెక్టు ఎత్తు, నీటి లభ్యత, ముంపునకు గురయ్యే భూములు, పరిహారం తదితర అంశాలపై సమగ్ర అధ్యయనం చేసేందుకు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కేంద్ర జల సంఘం అధ్యయనాలతో పాటు ఇరు రాష్ట్రాల నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని స్పష్టం చేశారు. వెనుకబడిన ప్రాంతాల పురోగతి, గిరిజనుల సామాజిక-ఆర్థిక అభ్యున్నతికి కట్టుబడి ఉన్నామని ఇరువురు ముఖ్యమంత్రులు ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్‌నూ ఈసీనే ఓటరుగా నమోదు చేయాలి

- ఈసీఓ సుదర్శన్ రెడ్డికి బీఆర్ఎస్ నేతల వినతి
- గడువు ముగుస్తున్నా నమోదులో తీవ్ర జాప్యంపై తలసాని ఆగ్రహం



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు ప్రక్రియలో ఎన్నికల కమిషన్ తీవ్రంగా విఫలమైందని, అర్హులైన ప్రతి పట్టభద్రుడిని అధికారులే స్వయంగా ఓటరుగా నమోదు చేయించాలని బిఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. నవంబరు 6తో నమోదు గడువు ముగుస్తున్నప్పటికీ ఎన్నికల యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. సోమవారం బిఆర్ కె భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డిని బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం కలిసి వినతిపత్రం అందజేసింది. అనంతరం ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, సురభి వాణి దేవి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌లతో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓటరు నమోదు బాధ్యత ముమ్మాటికీ ఎన్నికల కమిషన్‌దేనని తలసాని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమన్వయంతో నిర్వహించాల్సిన ఈ కార్యక్రమానికి ఇంతవరకు బూత్ లెవల్ ఆఫీసర్లను కూడా నియమించకపోవడం సిగ్గుచేటన్నారు. గ్రాడ్యుయేట్లలో అవగాహన కల్పించేందుకు ఎలాంటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించకపోవడం ఈసీ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని మండిపడ్డారు. గతంలో ఓటు వేసిన వారు మళ్లీ ఎందుకు నమోదు చేసుకోవాలనే ప్రశ్నకు అధికారుల వద్ద సమాధానం లేదని ఆరోపించారు. గత గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో హైదరాబాద్ నగర పరిధిలోనే 1.10 లక్షల మంది నమోదు కాగా, ప్రస్తుతం కేవలం 23 వేల దరఖాస్తులు మాత్రమే వచ్చాయని అధికారులు చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలో వచ్చిన 5.27 లక్షల దరఖాస్తుల వెరిఫికేషన్‌ను కూడా ఇంకా ప్రారంభించలేదని వెల్లడించారు. ఈసీ బాధ్యతలను విస్మరించడంతో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కష్టపడి స్వీకరించిన దరఖాస్తులను అందజేసేందుకు వెళ్తే, “బల్క్” దరఖాస్తులు తీసుకోమని అధికారులు వంకలు పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో లక్షలాది ఓట్లను తొలగించి, దానిపై బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా తగినంత సిబ్బందిని నియమించి, ఇంటింటికీ వెళ్లి అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్‌ను ఓటరుగా నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ ఛైర్మన్లు కోలేటి దామోదర్ గుప్తా, మన్నె క్రిశాంక్, గజ్జెల నగేష్, నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు ఆనంద్ గౌడ్, మాగంటి సునీత, అజ్మీ, ఓటరు నమోదు ఇన్‌ఛార్జీలు గోసుల శ్రీనివాస్ యాదవ్, వెంకట్ రెడ్డి, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్. హెచ్. ఎం ఉద్యోగుల సమ్మెకు బీఆర్ఎస్ మద్దతు

- ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ డిమాండ్
- మెడికవర్ ఆస్పత్రిపై ఉన్న శ్రద్ధ ఉద్యోగులపై ఏదీ?
- రేవంత్ రెడ్డి పాలనలో కాంట్రాక్ట్ ఉద్యోగుల పట్ల తీవ్ర అన్యాయం



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : రాష్ట్ర ప్రజల ప్రాణాలు కాపాడే జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులను రోడ్డున పడేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద గడచిన 14 రోజులుగా నిరవధిక సమ్మె నిర్వహిస్తున్న ఎన్.హెచ్.ఎం ఉద్యోగుల శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించి, బీఆర్ఎస్ పార్టీ తరఫున పూర్తయిన మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.కరోనా కష్టకాలంలో ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలను కాపాడిన ఎన్.హెచ్.ఎం ఉద్యోగులను 2018లో కేసీఆర్ ప్రభుత్వం జీతాలు పెంచి ఆదుకుందని గుర్తుచేశారు. కానీ, నేడు రేవంత్ రెడ్డికి హృదయం లేదని, గత 14 రోజులుగా 17,000 మంది ఉద్యోగులు వీధుల్లో సమ్మె చేస్తున్నా కనీసం పిలిచి మాట్లాడే సమయం కూడా కేటాయించలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఒకవైపు రాజ్యాంగాన్ని పట్టుకుని తిరుగుతుంటే, అదే పార్టీ పాలనలోని తెలంగాణలో మహిళా ఉద్యోగులకు కనీసం ప్రసూతి సెలవులు కూడా అమలవుకపోవడం దారుణమన్నారు. ఇతర ప్రభుత్వ శాఖలతో పాటు ప్రైవేట్ సంస్థల్లోనూ ప్రసూతి, పితృత్వ సెలవులు ఇస్తుంటే హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో ఎందుకు నిరాకరిస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణ అధికారులు హర్యానా, పంజాబ్, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో పర్యటించి, అక్కడ ఎన్.హెచ్.ఎం ఉద్యోగులను ఎలా క్రమబద్ధీకరించారో అధ్యయనం చేసి తెలంగాణలోనూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రూ.3 లక్షల కోట్ల బడ్జెట్‌లో కేవలం రూ.100 కోట్లు కేటాయిస్తే ఈ ఉద్యోగుల సమస్యలు తీరిపోతాయని, కేవలం రూ. 17 కోట్లతో 17,000 మంది ఉద్యోగులకు ఎంప్లాయీ హెల్త్ స్కీమ్ వర్తింపజేయవచ్చని స్పష్టం చేశారు. “నన్ను కోసినా రూపాయి లేదు” అని చెప్తూనే, ఫ్యూచర్ సిటీలో 8 లైన్ల రోడ్డుకు రూ.4,000 కోట్లు, మంత్రుల నివాసాలు, బాత్‌రూమ్‌ల నిర్మాణానికి కోట్లు తగలేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రభుత్వ దవాఖానాల్లో ప్రసవాలను 31% నుంచి 70%కి పెంచడంలో, మాతా-శిశు మరణాలు తగ్గించడంలో, 2.98 కోట్ల మందికి కంటి వెలుగు పరీక్షలు చేసి రాష్ట్రాన్ని అంధత్వ రహితంగా నిలపడంలో ఈ ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. ఈ సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాస్తామని, వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, హరీష్ రావుల దృష్టికి తీసుకెళ్లి అసెంబ్లీ వేదికగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి న్యాయం జరిగేలా పోరాడతామని ఆయన హామీ ఇచ్చారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
మంగళవారం, అక్టోబర్ 27, 2026

ఉద్యమం నుంచి మానవ సేవ వరకు..

మంతెన మణికుమార్ ప్రయాణం



జనగామ గడ్డపై ఎన్నో రాజకీయ, సామాజిక ఉద్యమాలు ఉద్భవించాయి. కానీ, కొందరి జీవిత ప్రయాణాలు కేవలం ఉద్యమాలకే పరిమితం కాకుండా భావి తరాలకు దారి చూపే మానవతా దీపాలుగా మారుతాయి. అలాంటి అరుదైన ప్రస్థానానికి ప్రతిరూపమే జనగామ 'అమ్మ ఫౌండేషన్' వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్. చిన్ననాటి కష్టాలను అధిగమించి, విద్యార్థి దశ నుంచి తెలంగాణ ఉద్యమం వరకు ప్రతి పోరాటంలోనూ ముందున్న ఆయన.. నేడు సేవే పరమావధిగా దశాబ్ద కాలంగా నిస్వార్థ సేవలను అందిస్తున్నారు. ఆకలితో అలమటించే వారికి అన్నం పెడుతూ, కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలకు తెగించి సేవలు చేస్తూ, పుట్టినరోజులను సేవా దినోత్సవాలుగా మలచిన మణికుమార్ ప్రయాణం నేడు ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

జనగామ, వాయిస్ ఆఫ్ వందే భారత్ -



- మంతెన మణికుమార్ ప్రయాణం
- 12 ఏళ్లుగా'అమ్మ ఫౌండేషన్' పేరుతో నిరంతరం సేవలు
- జనగామ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర
- ఆకలి తీరుస్తూ.. ఆపదలో అండగా నిలుస్తూ..
- ఆదర్శప్రాయంగా సాగుతున్న సేవా దశాబ్దపు ప్రయాణం



అక్టోబర్ 27న పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక కథనం



• తెలంగాణ ఉద్యమంలో అగ్రభాగాన..

ప్రజా సమస్యలపై స్పందించే తత్వం ఆయనను రాజకీయాల వైపు నడిపించింది. భారతీయ జనతా యువమోర్చా అధ్యక్షుడిగా రెండుసార్లు బాధ్యతలు నిర్వర్తించిన ఆయన, మలిదశ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించారు. తెలంగాణ సాధన కోసం జరిగిన రాస్తారోకోలు, ధర్నాలు, ఆందోళనల్లో చురుగ్గా పాల్గొని పలుమార్లు పోలీసుల లాఠీచార్జీలు, అరెస్టులు ఎదుర్కొన్నారు. తెలంగాణకు అనుకూలంగా కేంద్రం స్పందించాలని డిమాండ్ చేస్తూ ఏకంగా రెండుసార్లు టవర్‌పై ఎక్కి (ఒకసారి 9 గంటలు, మరోసారి 6 గంటలు) నిరసన తెలిపి తన ధైర్యాన్ని చాటుకున్నారు. అలాగే జనగామ జిల్లా సాధన ఉద్యమంలోనూ అమరణ నిరాహార దీక్షలు, బైక్ ర్యాలీల్లో పాల్గొని జైలు జీవితం కూడా గడిపారు.



• 'అమ్మ ఫౌండేషన్' ఆవిర్భావం

రాజకీయాలు, ఉద్యమాలు తాత్కాలిక మార్పులను తెచ్చినా, సమాజానికి శాశ్వతంగా ఉపయోగపడేది కేవలం 'సేవ' మాత్రమేనని గ్రహించిన మణికుమార్.. తన మిత్రులతో కలిసి జనగామలో 'అమ్మ ఫౌండేషన్'కు బీజం వేశారు. కోయాడ రవి ఇంట్లో ప్రతి ఆదివారం నిరాశ్రయులకు, యాచకులకు అన్నదానం చేయాలనే చిన్న ఆలోచనతో ప్రారంభమైన ఈ ప్రయాణం.. నేడు సంవత్సరమంతా నిరంతరాయంగా సాగే మహోద్యమంగా మారింది.

• సేవనే పండుగగా మలిచిన సంస్కృతి

పుట్టినరోజులు, పెళ్లి రోజులను కేకులు, ఫ్లెక్సీలతో ఆడంబరంగా జరుపుకోవడానికి బదులుగా ఆకలితో ఉన్నవారికి అన్నదానం చేయడం, మొక్కలు నాటడం, రక్తదానం చేయడం వంటి సేవలతో జరుపుకోవాలని అమ్మ ఫౌండేషన్ ఇచ్చిన పిలుపు జనగామలో విప్లవాత్మక మార్పు తెచ్చింది. ప్రతి పుట్టినరోజుకూ ఒక మొక్క నాటి సంరక్షించేలా 'బర్త్ డే ట్రీ' కార్యక్రమాన్ని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగుల బంధువుల ఆకలి తీర్చేందుకు 'అమ్మ క్యాంటీన్' సేవల ద్వారా నిత్యం వందలాది మందికి అల్పాహారం, భోజనం అందిస్తున్నారు.

• కరోనా కాలంలో ఆదర్శవంతమైన సేవలు

మహమ్మారి సమయంలో భయంతో అందరూ ఇళ్లకే పరిమితమైతే, అమ్మ ఫౌండేషన్ సభ్యులు ఒక్క రోజు కూడా విశ్రాంతి తీసుకోలేదు. లాక్‌డౌన్‌లో ఇబ్బంది పడ్డ వలస కార్మికులకు, నిరాశ్రయులకు నిత్యావసరాలు, రోజూ వందలాది ఆహార ప్యాకెట్లు అందజేశారు. అంత్యక్రియలకు ఎవరూ ముందుకు రాని అనాథ మృతదేహాలకు స్వయంగా అంత్యక్రియలు నిర్వహించి మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు.



• భవిష్యత్ లక్ష్యాలు - జనహిత ప్రణాళికలు

ఇప్పటికే 12 ఏళ్ల విజయవంతమైన ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న అమ్మ ఫౌండేషన్ భవిష్యత్తులో మరిన్ని బృహత్తర కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. అమ్మ ఫుడ్ బ్యాంక్: ఆకలితో ఉన్నవారు ఎప్పుడైనా వచ్చి ఆహారం తీసుకునేలా ఏర్పాట్లు. నైట్ షెల్టర్ హోమ్: ప్రయాణంలో ఇబ్బంది పడే నిరుపేదలకు ఉచిత రాత్రి బస. అమ్మ బడి: గుడిసెల్లో నివసించే పిల్లలకు సాయంత్రం ఉచిత విద్య బోధన. దయగల గోడ: ఉపయోగించని దుస్తులు, పుస్తకాలు అవసరమైన వారికి చేర్చే వ్యవస్థ. పేద కుటుంబాలకు ఉచితంగా ఫ్రీజర్ బాక్స్ సేవలందించడం.

పదేళ్ల క్రితం కొద్దిమంది మిత్రులతో ప్రారంభమైన అమ్మ ఫౌండేషన్ నేడు జనగామలో మానవత్వానికి మారుపేరుగా నిలిచింది. "సేవ అంటే ప్రచారం కాదు, బాధలో ఉన్నవారికి భరోసా ఇవ్వడం" అనే నినాదంతో ముందుకు సాగుతున్న మంతెన మణికుమార్ ప్రయాణం.. సమాజాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరికీ ఎప్పటికీ గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుంది.

కష్టాల నడుమ బాల్యం..

మంతెన మణికుమార్ 1984 అక్టోబర్ 27న జనగామలో జన్మించారు. వారి తండ్రిది కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం లక్ష్మంజిపల్లి స్వస్థలం కాగా, కుటుంబ పరిస్థితుల రీత్యా జనగామ సంజయ్‌నగర్‌లో స్థిరపడ్డారు. చిన్నతనంలోనే తల్లిని కోల్పోవడంతో తాత ఉదత వెంకటయ్య, అమ్మమ్మ వెంకటమ్మల సంరక్షణలో పెరిగారు. చేనేత వృత్తిలో భాగంగా ఆయన తండ్రి మంతెన శంకరయ్య కార్మికుల హక్కుల కోసం జీవితాంతం పోరాడారు. 2011లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేనేత సమస్యలపై జరిగిన ధర్నాలో తండ్రితో కలిసి పాల్గొన్న మణికుమార్‌లో అప్పుడే సమాజం కోసం పనిచేయాలనే సంకల్పం బలపడింది. జనగామ శ్రీవిద్య మందిర్‌లో చదువుకునే రోజుల్లోనే విప్లవ వీరుడు భగత్‌సింగ్ స్ఫూర్తితో 'భగత్‌సింగ్ యువజన బృందం' ఏర్పాటు చేసి రక్తదాన శిబిరాలు నిర్వహించారు.



వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
మంగళవారం, అక్టోబర్ 27, 2026

కలెక్టర్‌ను కలిసిన టీజేఏ జిల్లా కమిటీ

కలెక్టర్ హేమంత్ సహదేవ్ రావ్‌కు సన్మానం

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి వినతి



ములుగు, వాయిస్ ఆఫ్ వందే భారత్ : ములుగు జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవ్ రావ్‌ను తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేఏ) ములుగు జిల్లా కమిటీ సభ్యులు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ సభ్యులకు కలెక్టర్ ఈ సందర్భంగా తన శుభాకాంక్షలు తెలియజేశారు. కలెక్టర్‌తో భేటీ అనంతరం టీజేఏ ములుగు జిల్లా ప్రతినిధులు మాట్లాడుతూ... జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, వాటి పరిష్కారానికి పూర్తి స్థాయిలో సహకరించాలని కోరినట్లు తెలిపారు. వినతిపై కలెక్టర్ ఎంతో సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజేఏ ములుగు జిల్లా అధ్యక్షుడు బేతి సతీష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎనగందుల కొమురయ్య, గౌరవ అధ్యక్షుడు ఎర్రం స్వామి, ఉపాధ్యక్షుడు చల్లగురుగుల రాజు, సంయుక్త కార్యదర్శి గట్టు ప్రశాంత్ గౌడ్, కమిటీ సభ్యుడు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలి

- **డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్**
- **అఫ్జల్ సాగర్ యూపీహెచ్ సీ ఆకస్మిక తనిఖీ**
- **ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశం**



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందించాలని హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ఆదేశించారు. నాంపల్లి క్లస్టర్ పరిధిలోని అఫ్జల్ సాగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మురళీధర్‌తో కలిసి ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్, రోగులకు అందుతున్న సేవలు, ఔషధాల లభ్యత, లాబొరేటరీ, పరిశుభ్రత పరిస్థితులు మరియు వైద్య రికార్డులను సమగ్రంగా పరిశీలించారు. అక్టోబర్ 23 నుండి 31 వరకు జరుగుతున్న 'క్యాచ్ అప్ క్యాంపెయిన్' ద్వారా వ్యాక్సిన్లు తీసుకోని, లేదా అసంపూర్తిగా టీకాలు పొందిన పిల్లలందరినీ గుర్తించి 100% వ్యాక్సినేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. టీకాల నిల్వలు, శీతలీకరణ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. వచ్చే నెల 5 వరకు కొనసాగే 'లెప్రసి కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్'లో భాగంగా ఫీల్డ్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టి, కొత్త కేసులను గుర్తించి తక్షణమే ఉచిత చికిత్స అందించాలని స్పష్టం చేశారు. నాన్-కమ్యూనికేబుల్ డిసీజెస్ సర్వే, స్క్రీనింగ్, మరియు ఫాలో-అప్ ప్రతిరోజూ పూర్తి చేసి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.



అర్హులైన బాలికలను గుర్తించి హెచ్‌పివి వ్యాక్సిన్ వేయించే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. అన్ని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మరియు బస్తీ దవాఖానల్లో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు అవసరమైన అన్ని రకాల మందులను నిరంతరం అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. వర్షాకాలం/సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వ్యాపించకుండా ఇంటింటికీ తిరుగుతూ హెల్త్ సర్వేలు నిర్వహించడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు ప్రతి ఒక్క పేద పౌరుడికి చేరేలా వైద్యాధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సీహెచ్ఓ, యుపిహెచ్‌సి సిబ్బందికి ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ దిశానిర్దేశం చేశారు.

హన్మకొండ జిల్లా కోర్టులో పట్టభద్రుల ఓటర్ నమోదు

- **హాజరైన మాజీ ఎంపీ వినోద్ కుమార్, మాజీ విప్ వినయ్ భాస్కర్, రాకేష్ రెడ్డి**
- **న్యాయవాదులు ఓటర్లుగా నమోదు కావాలని పిలుపు**



హన్మకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ : హన్మకొండ జిల్లా కోర్టు ప్రాంగణంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ విప్, శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాకేష్ రెడ్డిలు పార్టీ లీగల్ సెల్ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయవాదుల వద్ద నుంచి ఓటరు నమోదు దరఖాస్తులను స్వీకరించి, నమోదు ప్రక్రియను పరిశీలించారు.సమాజం పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండి, చట్టాలను, వ్యవస్థలను నడిపించే విజ్ఞులైన న్యాయవాదులు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగస్వామ్యం కావాలని నేతలు పిలుపునిచ్చారు. పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు, తమ విలువైన తీర్పును ఇవ్వడానికి అర్హులైన ప్రతి న్యాయవాది తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ లీగల్ సెల్ ప్రతినిధులు, బార్ అసోసియేషన్ నాయకులు, పెద్ద సంఖ్యలో న్యాయవాదులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

వాల్మీకి బోయల ఎస్టీ హోదా కల నెరవేర్చాలి

- **టీఆర్ఎస్ నాయకుడు డాక్టర్ రఘు**



కోరుట్ల, వాయిస్ ఆఫ్ వందే భారత్: వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని తెలంగాణ రక్షణ సేన కోరుట్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ డాక్టర్ రఘు ఆ మహనీయుడికి ఘన నివాళులు అర్పించారు. వాల్మీకి మహర్షి రచించిన రామాయణ మహాకావ్యం తరతరాలకు ఆదర్శంగా నిలుస్తూ, మానవాళికి అత్యంత విలువైన నైతిక సందేశాన్ని అందిస్తోందని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ప్రజలందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణలో వాల్మీకి బోయలు ఎన్నో ఏళ్లుగా సామాజిక, ఆర్థిక, విద్యా రంగాల్లో తీవ్ర వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమను ఎస్టీ జాబితాలో చేర్చాలనే డిమాండ్‌తో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నప్పటికీ, ప్రభుత్వాలు మారుతున్నా వారి ఆశలు నెరవేరకపోవడం విచారకరమన్నారు. కోరుట్ల నియోజకవర్గంలోని వివిరావుపేట, సిరిపూర్, మల్లాపూర్ తదితర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో వాల్మీకి బోయ కుటుంబాలు నివసిస్తున్నాయని తెలిపారు. వారి ఆకాంక్షలను, ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం గుర్తించి తక్షణమే న్యాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. వాల్మీకి బోయలకు ఎస్టీ హోదా కల్పించే ప్రక్రియను రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాలు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ వర్గానికి చెందిన యువతకు విద్య, ఉపాధి అవకాశాలు పెరగాలని, రాజకీయ ప్రాతినిధ్యం మెరుగుపడి వారి పిల్లలకు బంగారు భవిష్యత్తు అందాలని ఆకాంక్షించారు. వాల్మీకి బోయల హక్కుల సాధనకు, వారి ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు సామాజిక న్యాయం దిశగా ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని డాక్టర్ రఘు పిలుపునిచ్చారు.

శ్రీ ఆదిత్య మెడికల్ హాల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే నవీన్ యాదవ్



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'శ్రీ ఆదిత్య మెడికల్ హాల్'ను స్థానిక ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ సోమవారం రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మెడికల్ హాల్ యాజమాన్యానికి, నిర్వాహకులకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. మెడికల్ హాల్ ప్రారంభోత్సవం అనంతరం ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ... స్థానిక ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ నాణ్యమైన ఔషధాలను, మందులను అందించాలని సూచించారు. వ్యాపారంతో పాటు సామాజిక దృక్పథంతో మెరుగైన వైద్య సేవలు అందించి ప్రజల నమ్మకాన్ని పొందాలని ఆకాంక్షించారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, మెడికల్ హాల్ నిర్వాహకులు, వ్యాపార ప్రముఖులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

గురునానక్ మందిర్ కమాన్ల నిర్మాణానికి జగ్గారెడ్డి భూమిపూజ

- **హామీని నిలబెట్టుకున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్**
- **ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు**



సంగారెడ్డి, వాయిస్ ఆఫ్ వందే భారత్ : సంగారెడ్డి పట్టణంలో ఆధ్యాత్మిక శోభ విల్లివిరిసేలా గురునానక్ మందిర్ కమాన్ల నిర్మాణానికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సోమవారం శ్రీకారం చుట్టారు. గత గురునానక్ జయంతి సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు బ్రాహ్మణవాడలోని రెండు ప్రాంతాలలో కమాన్ల నిర్మాణానికి ఆయన వైభవంగా భూమిపూజ నిర్వహించారు. గురునానక్ మందిర్‌కు వెళ్లే ప్రధాన ప్రవేశ మార్గంలో ఒకటి, మందిర్ సమీపంలోని భవాని మందిర్ రోడ్డులో మరొక కమాన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భూమిపూజ కార్యక్రమానికి ముందు జగ్గారెడ్డి గురునానక్ మందిర్‌ను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మందిర్ ప్రతినిధులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా, వాటిని త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మందిర్ ప్రాంగణంలో రావిచెట్టు కింద ఉన్న నాగదేవత ఆలయాన్ని అభివృద్ధి చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్‌కు జగ్గారెడ్డి సూచించారు. ప్రస్తుతం ఉన్న విగ్రహాలను యథాస్థానంలోనే ఉంచి, ఎటువంటి భంగం కలగకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో సిక్కు సమాజ ప్రముఖులు డాక్టర్ సర్దార్ సురేందర్ గోపి సింగ్, సర్దార్ తేజేందర్ సింగ్, సర్దార్ స్వరణ్ సింగ్, సర్దార్ సత్‌పాల్ సింగ్, డాక్టర్ సర్దార్ భరత్ సింగ్, సిక్కు గురువు గురుదేవ్ సింగ్‌లతో పాటు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్, నాయకులు బొంగుల రవి, కూన సంతోష్, మహేష్ ముదిరాజ్, శ్రీహరి, సుదీప్, నరేన్, సుధాకర్ పాల్గొన్నారు.